ఆంధ్రజ్యోతి


andhrajyothy.com గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.5, కనిష్ఠం 24.1

నిజామాబాద్

జిల్లా వార్తలు

5

శుక్రవారం 2 ఆగస్టు 2024





జాలువారుతున్న రాళ్లవాగు

కమ్మర్‌పల్లి: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కోనాపూర్ రాళ్లవాగు మత్తడి జాలువారుతోంది. పక్షం రోజులుగా అడపాదడపగా కురుస్తున్న ముసురు వర్షాలకు రాళ్లవాగు ప్రాజెక్టులోకి కొంతమేర వరద వచ్చి చేరుతుండగా గురువారం సాయంత్రం కోనాపూర్ రాళ్లవాగు పొంగిపొర్లింది. మండలంలోని చెరువులు, కుంటల్లో 60 నుంచి 80 శాతం వరకు నీరు చేరింది. గత ఏడాది ముందుగానే పొంగిపొర్లిన రాళ్లవాగు ఈ సారి ఆలస్యంగానైనా అలుగుపారడంతో రైతుల్లో ఆనందం వెల్లువిరిసింది. ప్రకృతి ప్రేమికులు సైతం జలాశయ అందాలను తిలకించేందుకు పలు ప్రాంతాల నుంచి తరలివస్తున్నారు.



ఎస్సారెస్పీకి వరద ఉధృతి

- మహారాష్ట్రలోని విష్ణుపురి గేట్లు ఎత్తడంతో ప్రాజెక్టులోకి 28,776 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- కందకుర్తి వద్ద త్రివేణి సంగమంలో క్రమేపీ పెరుగుతున్న గోదావరి
- జిల్లా వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు
- జిల్లాలో ఇప్పటి వరకు 548 మి.మీ. కురిసిన వర్షం

నిజామాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శ్రీరామసాగర్ ప్రాజెక్టుకు గోదావరి వరద ఉధృతి పెరుగుతోంది. మహారాష్ట్రలోని విష్ణుపురి, బాలేగావ్ గేట్లను ఎత్తడంతో వరద ఎక్కువవుతోంది. విష్ణుపురి ప్రాజెక్టు నిండటంతో ఆ ప్రాజెక్టు నుంచి 55వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రెండు రోజుల నుంచి వరద ప్రాజెక్టులోకి తగ్గగా మళ్లీ ఎగువ ప్రాంతంలో పడుతున్న వర్షాలతో పెరిగింది. మహారాష్ట్రలోని విష్ణుపురి పైన ఉన్న ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు పడుతుండటంతో ఈ వరద వస్తున్నట్లు ఎస్సారెస్పీ అధికారులు తెలిపారు. రెండు రోజుల పాటు వరద కొనసాగే అవకాశం ఉండటంతో మరో 10 టీఎంసీల వరకు నీళ్లు వచ్చే అవకాశం ఉంది.

మహారాష్ట్రలో భారీ వర్షాలు

మహారాష్ట్రలో భారీ వర్షాలు పడుతుండటంతో గోదావరికి వరద వచ్చి చేరుతోంది. మహారాష్ట్ర నాందేడ్ జిల్లాలో ఉన్న విష్ణుపురి, బాలేగావ్, అందూరా ప్రాజెక్టులు నిండటంతో వరద పెరుగుతోంది. అక్కడ భారీ వర్షాలు పడుతుండటం వల్ల ప్రాజెక్టుల గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. విష్ణుపురి ప్రాజెక్టు నుంచి 55వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు మొత్తం గేట్లను ఎత్తి నీటిని వదులుతున్నారు. ఈ ప్రాజెక్టుతో పాటు బాలేగావ్ ప్రాజెక్టు కూడా నిండటంతో ఎక్కువ మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ రెండు ప్రాజెక్టులతో పాటు వాగులు, మంజీరా నుంచి కొంత మేర వరద వస్తుండటంతో ఎస్సారెస్పీ నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి ప్రస్తుతం 28,776 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 1091 అడుగులకు గాను 1076.9 అడుగుల నీటిమట్టం చేరుకుంది. ప్రాజెక్టులో పూర్తిస్థాయి కెపాసిటీ 80.5 టీఎంసీలకు గాను 37.113 టీఎంసీలకు నీళ్లు చేరుకున్నాయి.



• నిండుకుండలా త్రివేణి సంగమం

ప్రాజెక్టుపైనే ఉత్తర తెలంగాణ రైతుల ఆశలు..

శ్రీరాంసాగర్ ప్రాజెక్టుపైనే ఉత్తర తెలంగాణ రైతులు ఆశలు పెట్టుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని పంపింగ్ చేయకపోవడం వల్ల ఆయకట్టు రైతులు ఈ ప్రాజెక్టు నీటి కోసమే ఎదురు చూస్తున్నారు. భారీ వర్షాలు పడుతుండటంతో ఉత్తర తెలంగాణ పరిధిలోని నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్, వరంగల్, హన్మకొండ జిల్లాల రైతులు పంటలు సాగు చేస్తున్నారు. భారీ వర్షాలతో పాటు బోర్ల ద్వారా పంటలు వేస్తున్న రైతులు ఆయకట్టుకు ప్రాజెక్టు నిండితే నీళ్లు వస్తాయని భావిస్తున్నారు. ఎస్సీరెస్పీలో 50 టీఎంసీలు దాటితే నీటిని ఆయకట్టుకు మళ్లిస్తారు. రాష్ట్ర ప్రభుత్వ స్థాయిలో నిర్ణయం తీసుకొని ప్రణాళిక రూపొందించి కాకతీయ, లక్ష్మి, సరస్వతి కాలువలతో పాటు ఎత్తిపోతల పథకాలకు నీటిని విడుదల చేస్తారు. వరద భారీగా పెరిగితే వరద కాలువ ద్వారా నీటిని ఎల్ఎండీకి, మిడ్‌మానేరుకు మళ్లిస్తారు. ఉత్తర తెలంగాణ పరిధిలోని 12 లక్షల ఎకరాల వరకు సాగుకు నీటిని అందిస్తారు. ప్రతీ సంవత్సరం వానాకాలంలో రెండు మూడు తడులకు నీటిని విడుదల చేస్తుండగా యాసంగిలో మాత్రం మొత్తం పంటకు నీటిని అందిస్తున్నారు. వర్షాలు భారీగా పడితే ప్రాజెక్టు నిండిన తర్వాత ప్రతీ సంవత్సరం కాలువల ద్వారా వరద నీటిని సాగుకు మళ్లిస్తున్నారు. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టాన్ని ఉంచుతూనే దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ సంవత్సరం కూడా కాళేశ్వరం నీరు విడుదల కాకపోవడం వల్ల జిల్లాల పరిధిలోని రైతులు ఎస్సారెస్పీపైనే ఆశలు పెట్టుకున్నారు. గత సంవత్సరం వరకు కాళేశ్వరం నీటిని పంపింగ్ చేసి మిడ్‌మానేరుతో పాటు ఎల్ఎండీకి నీటిని అందించారు. ఎస్సారెస్పీ నీటిని ఎల్ఎండీ ఎగువన ఉన్న ఆయకట్టుకు అందించారు. మూడేళ్లుగా కాళేశ్వరం నీటిని మళ్లించి నీటిని ఎస్సారెస్పీలో నిలువ ఉంచారు. అవసరం మేరకు మిడ్‌మానేరుకు మళ్లించి మల్లన్న సాగర్ వరకు నీటిని తీసుకువెళ్లారు. ఈ దఫా నీటి విడుదల కాళేశ్వరం నుంచి లేకపోవడం వల్ల కాకతీయ కాలువ స్టేజ్-2 వరకు ఈ నీటినే యాసంగిలో మళ్లించారు. ఈ వానాకాలంలో కూడా ప్రాజెక్టు నిండితే ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం వరద పెరుగుతున్నందున 50 టీఎంసీలు దాటితే ఆయకట్టు సాగు ప్రణాళికను తయారు చేయనున్నారు. ప్రాజెక్టు పరిధిలో 12లక్షల ఎకరాల వరకు సాగునీరు అందనుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరితే వానాకాలం సాగు ఆయకట్టుపై నిర్ణయం తీసుకుంటామని ఎస్సారెస్పీ ఎస్ఈ శ్రీనివాస్‌గుప్త, ఈఈ చక్రపాణి, ఏఈ వంశీలు తెలిపారు.

జిల్లాలో కురుస్తున్న వర్షం..

జిల్లాలో బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు 20.9 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది. జిల్లాలోని డిచ్ పల్లి మండలంలో అత్యధికంగా 51.3 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో జూన్ నుంచి ఇప్పటి వరకు 446.9 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 548 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో సరాసరి సగటు వర్షపాతం కంటే 102 మిల్లీమీటర్ల వర్షం ఎక్కువగా పడింది. 19 మండలాల్లో అత్యధికంగా వర్షం పడగా 14మండలాల్లో సగటు వర్షపాతం నమోదైంది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలో మరో రెండు రోజుల వర కు ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.



• కందకుర్తి బ్రిడ్జి వద్ద కొనసాగుతున్న వరద ప్రవాహం

జిల్లాలో ఎమ్మార్పీఎస్ సంబురాలు

- ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు
- ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో స్వీట్లు పంచిన నాయకులు



సుభాష్‌నగర్, ఆగస్టు 1: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతో గురువారం జిల్లా వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చారు. అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగల చిత్రపటాలకు సైతం క్షీరాభిషేకం నిర్వహించారు. 30ఏళ్ల పోరాట ఫలితంగానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని నాయకులు పేర్కొన్నారు. నగరంలోని పూలాంగ్ చౌరస్తా వద్ద మాదిగ రాజకీయ పోరాట సమితి ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి గందమాల నాగభూషణం మాట్లాడుతూ.. న్యాయమైన పోరాటం ఫలించినందుకు ఆనందంగా ఉందని అన్నారు. ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పును పూర్తిగా అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడం సంతోషకరమన్నారు. వర్గీకరణ కోసం పట్టువదలని విక్రమార్కులా నిరంతరం పోరాటం చేసిన మంద కృష్ణ మాదిగకు జాతి తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాజేంద్రకుమార్, శివ, దీపక్, కిష్టయ్య, గంగాధర్, సుధా, సుమన్, శ్రీను, మల్లేష్, యాదగిరి, గణేష్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.



- టీయూలో కొత్త కోర్సులకు ప్రతిపాదనలు పంపిన అధికారులు
- స్పందించని సర్కారు
- ఉన్నత విద్యకోసం ఇతర జిల్లాలకు వెళ్తున్న విద్యార్థులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు

ప్రతిపాదనలకే పరిమితం!

నిజామాబాద్, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్రస్థాయిలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఇతర ప్రొఫెషనల్ కోర్సుల అడ్మిషన్లు జరుగుతున్నా.. జిల్లాకు మాత్రం కొత్త కాలేజీలు రాలేదు. కొత్త కోర్సులను ప్రవేశపెట్టడం లేదు. తెలంగాణ విశ్వవిద్యాలయంలోనూ పీజీలో కొత్త కోర్సులకు అనుమతులు రాలేదు. రెండేళ్లుగా ఈ విశ్వవిద్యాలయం పరిధిలో ఇంజనీరింగ్ కళాశాలతో పాటు ఉపాధినిచ్చే పీజీ కోర్సులు ప్రవేశపెట్టేందుకు ప్రతిపాదనలు పంపించినా ఫలితం లేదు. గత ప్రభుత్వ హయాంలో పట్టించుకోకపోవడం వల్ల ఈ అకాడమిక్ ఇయర్‌లో కూడా ఇంజనీరింగ్ కళాశాలకు అనుమతులు రాలేదు. అన్ని వసతులు ఉన్నా.. కొత్త కోర్సులకు మాత్రం అనుమతులు ఇవ్వలేదు. ఇతర జిల్లాలోని విశ్వవిద్యాలయాలకు కొత్త కోర్సులను, కొత్త కళాశాలలను మంజూరు చేసినా.. జిల్లాకు మాత్రం ఇప్పటి వరకు రాలేదు. ఇంజనీరింగ్‌తో పాటు ఏజీ బీఎస్సీ కోర్సు నడిపేందుకు అవకాశం ఉన్నా పూర్తిస్థాయిలో ప్రయత్నాలు చేయకపోవడం వల్ల జిల్లాకు కేటాయించలేదు. దీంతో ఉన్నత విద్య కోసం విద్యార్థులు ఇతర జిల్లాలకు వలస వెళ్తున్నారు. అయినా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

విద్యాశాఖ పరిధిలోనే నిలిచిన ప్రతిపాదనలు

జిల్లాలో ఇంజనీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్ కోర్సుల కోసం కొత్త కళాశాలలు ప్రభుత్వం ఆధీనంలో పెట్టాలని ఎన్నో ఏళ్లుగా విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా నుంచి ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లినా ఉన్నత విద్యాశాఖ పరిధిలోనే నిలిచిపోయాయి. జిల్లా ప్రజాప్రతినిధులతో పాటు నేతలు పట్టించుకుంటే ఇప్పటికే ఈ కళాశాలలు ఏర్పాటు అయ్యేవి. తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో రెండేళ్లుగా ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ఏర్పాటు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. పలు దఫాలు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. మొదట జేఎన్‌టీయూ బ్రాంచ్‌ను ఏర్పాటు చేసేందుకు కొంత సుముఖత వ్యక్తపర్చినా తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలోనే ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలలు ఏర్పాటు చేయాలని విద్యార్థుల నుంచి డిమాండ్ పెరగడంతో మళ్లీ ప్రతిపాదనలు పంపించారు. విశ్వవిద్యాలయం పరిధిలో ఇప్పటికే పీజీ స్థాయిలో కంప్యూటర్ కోర్సులను నిర్వహిస్తున్నారు. ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్‌తో పాటు ఎమ్మెస్సీ కంప్యూటర్ కోర్సులు కొనసాగుతున్నాయి. వీటి పరిధిలోనే ఇంజనీరింగ్ కళాశాలలను ఏర్పాటు చేసేందుకు నిర్ణయించి ప్రతిపాదనలు పంపించారు. ఇప్పటికే విశ్వవిద్యాలయం పరిధిలో ఎమ్మెస్సీ, ఫార్మస్యూటికల్ కెమిస్ట్రీ కొనసాగుతోంది. ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కోర్సు కూడా కొనసాగుతోంది. వీటి పరిధిలో బీఫార్మసీ కోర్సును పెట్టేందుకు ప్రయత్నాలు చేశారు. ఇప్పటి వరకు మాత్రం అనుమతులు రాలేదు. గత ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనలు పంపించినా అనుమతులు మాత్రం రాలేదు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కూడా ఈ అకాడమిక్ ఇయర్‌లో కోర్సులను నడిపించేందుకు ప్రయత్నాలు చేశారు. ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు మరోదఫా పంపించారు. కొత్త కళాశాలలను కొన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జిల్లాకు మాత్రం ఇప్పటి వరకు అనుమతులు రాలేదు. జిల్లాలో అన్ని వనరులు విశ్వవిద్యాలయంలో ఉన్నా కొత్త కళాశాలలు రాకపోవడం వల్ల ఇబ్బందులు విద్యార్థులు ఎదుర్కొంటున్నారు. ఇంజనీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కోర్సుల కోసం జిల్లా విద్యార్థులు ఇతర జిల్లాలకు వెళ్లి చేస్తున్నారు. ప్రభుత్వ పరిధిలో కళాశాలలు వస్తే మెజార్టీ విద్యార్థులకు ఉపయోగపడే అవకాశం ఉన్నా ఇప్పటి వరకు మాత్రం రాలేదు. తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో ఈ యేడాది కొత్త కోర్సులకు కూడా అవకాశం రాలేదు. ఎమ్మెస్సీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, నానో టెక్నాలజీతో పాటు ఉపాధిని ఇచ్చే కోర్సులు పెట్టేందుకు ప్రయత్నాలు చేసినా అనుమతులు మాత్రం ఇప్పటి వరకు రాలేదు.

ఏజీబీఎస్సీకి అనుమతులివ్వని సర్కారు

జిల్లాలో వ్యవసాయ కోర్సులైన ఏజీబీఎస్సీని పెట్టేందుకు అవకాశం ఉన్నా ఇప్పటి వరకు అనుమతులు ఇవ్వలేదు. రుద్రూర్‌లోని వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఇప్పటికే అగ్రికల్చర్ పాలిటెక్నిక్ కొనసాగుతోంది. దీంతో పాటు వ్యవసాయ విశ్వవిద్యాలయం అనుబంధంగా బీటెక్ ఫుడ్ టెక్నాలజీ కోర్సు నడుస్తుంది. ఈ క్యాంపస్‌లో 300 ఎకరాలకు పైగా భూమి ఉంది. వ్యవసాయ కోర్సులైన ఏజీబీఎస్సీ, ఏజీ ఎమ్మెస్సీ పెట్టేందుకు కావాల్సిన వనరులు కూడా ఉన్నాయి. ఎన్నో ఏళ్ల నుంచి ఈ పరిశోధన కేంద్రం కొనసాగుతోంది. పలు జిల్లాల పరిధిలో ఏజీబీఎస్సీ, హార్టికల్చర్ కోర్సులకు అవకాశం ఇచ్చిన జిల్లాలోని ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం వల్ల ఈ కోర్సు రావడం లేదు. రాష్ట్రంలో ఏజీబీఎస్సీ సీట్లు రాని వారు పక్కనే ఉన్న మహారాష్ట్రకు వెళ్లి పది లక్షలకు పైగా ఖర్చుపెట్టి చదువుతున్నారు. జిల్లాలో ఉన్న రుద్రూర్‌లో ఈ కోర్సును ప్రవేశపెడితే ఎక్కువ మంది విద్యార్థులకు ఉపయోగపడే అవకాశం ఉంది. జిల్లాలోని ప్రజాప్రతినిధులతో పాటు విద్యావంతులు పట్టించుకుంటే కొత్త కోర్సులతో పాటు ప్రభుత్వ ఆధ్వర్యంలో కొత్త కళాశాలలు వస్తే జిల్లా విద్యార్థులకు మేలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేస్తే వచ్చే అకాడమిక్ ఇయర్‌లోపు అనుమతులు వచ్చే అవకాశం ఉంది.



• నర్సరీని పరిశీలిస్తున్న కలెక్టర్



• విద్యార్థుల పుస్తకాలను పరిశీలిస్తున్న కలెక్టర్

నర్సరీల నిర్వహణపై దృష్టి పెట్టాలి

మోస్రా, ఆగస్టు 1: మండలంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆకస్మిక తనిఖీలో భాగంగా గోవూర్ గ్రామంలో వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన నర్సరీల నిర్వహణపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. మండలంలోని గోవూర్ గ్రామంలో నర్సరీని కలెక్టర్ గురువారం పరిశీలించారు. అదే విధంగా స్థానికంగా ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించి విద్యాబోధన విషయాలు విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యాబోధన విషయంపై మాట్లాడుతూ ప్రైవేట్ సంస్థలకు దీటుగా విద్యాబోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలు పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రం ఆవరణలో ఉన్న పిచ్చి మొక్కలు తొలగించాలని సూచించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూల్‌లో చేపట్టిన పనులను పరిశీలించి ఆయా తరగతుల నిర్వహణకు అందిస్తున్న విద్యాబోధన, డిజిటల్ తరగతుల నిర్వహణ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట మండల ప్రత్యేక అధికారి రమేష్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి తుకారాం రాథోడ్, పంచాయతీరాజ్ ఈఈ శంకర్ నాయక్, వైద్య అధికారి విజయ్ కుమార్, డీఎల్‌పీవో మధుకర్, ఎంపీవో వెంకటేశ్వర్లు ఉన్నారు.

స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి..

• వీసీలో సీఎస్ శాంతికుమారి

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 1: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేసేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సీఎస్ శాంతికుమారి కలెక్టర్లకు ఆదేశించారు. గురువారం సాయంత్రం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో ఆమె ఈ కార్యక్రమంపై దిశానిర్దేశం చేశారు. ఐదు రోజుల పాటు చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి వివరించారు. వీసీ అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు వివిధ శాఖల అధికారులతో సమావేశమై స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రతి జీపీ, మున్సిపల్ పరిధిలో కార్యక్రమాలను చేపట్టేలా కార్యాచరణను రూపొందించుకోవాలని ఆదేశించారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ అంకిత్, నగర పాలక సంస్థ కమిషనర్ మకరంద్, ట్రైనీ కలెక్టర్ సంకేత్, డీఆర్‌డీవో సాయాగౌడ్, డీపీవో తరుణ్‌కుమార్, డీఈవో దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



బాల్కొండ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రజీయొద్దీన్

ముప్కాల్, ఆగస్టు 1: బాల్కొండ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రజీయొద్దీన్ అస్లం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ప్రిన్సిపాల్ అర్గుల చిన్నయ్య అయిలాపూర్ జూనియర్ కాలేజీకి బదిలీపై వెళ్లగా రజీయొద్దీన్ అస్లం బాధ్యతలు స్వీకరించారు.

డీఎంహెచ్‌వోగా రాజశ్రీ బాధ్యతల స్వీకరణ

పెద్దబజార్, ఆగస్టు 1: జిల్లా వైద్యశాఖ అధికారిగా డాక్టర్ రాజశ్రీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా విధులు నిర్వహించిన డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ ఆర్మూర్‌కు బదిలీ అయ్యారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ హైదరాబాద్‌లోని చార్మినార్ జోన్ నుంచి జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి రాజశ్రీకి శుభాకాంక్షలు తెలిపారు.

పంచాయతీరాజ్ డీఈగా కిషన్‌నాయక్

ఆర్మూర్‌రూరల్, ఆగస్టు 1: ఆర్మూర్ డివిజన్ పంచాయతీరాజ్ డీఈగా కిషన్‌నాయక్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవలి వరకు డీఈగా పని చేసిన బాబురాం పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో ఇందల్వాయిలో పీఆర్‌ఏఈగా పని చేస్తున్న కిషన్‌నాయక్ పదోన్నతి పొంది ఆర్మూర్ పంచాయతీరాజ్ డీఈగా బాధ్యతలు స్వీకరించారు. డీఈగా బాధ్యతలు చేపట్టిన కిషన్‌నాయక్‌ను ఈఈ బావన్న, రాజేశ్వర్‌లు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌ఏఈలు నితిష్, రాజ్‌కుమార్, మేఘన, ఇంద్రసేన్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, ఆగస్టు 1: వాక్ ఫర్ ఇన్నోవేషన్ ఇంటింటా ఇన్నోవేటర్ పేరు మీద కొత్త ఆలోచనలు రేకెత్తించేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్ పీఆర్ మేనేజర్ వాణి ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త ఆవిష్కరణలకు, ఆలోచనలు రేకెత్తించే విధంగా అన్ని జిల్లాల నుంచి ఈ దరఖాస్తులను ఆగస్టు 3 వరకు స్వీకరిస్తున్నామని తెలిపారు. కొత్త ఆలోచనలతో పంపిస్తే ఆగస్టు 15న ప్రదర్శన ఏర్పాటు చేస్తామని వారికి అవకాశం కల్పిస్తామని తెలిపారు. జిల్లా నుంచి ఎక్కువ మంది తెలంగాణ స్టేట్ ఇన్నోవేషన్ సెల్‌కు గడువులోపు పంపించాలని ఆమె కోరారు.

కేజీబీవీలో సహాయ వంట మనిషి పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

రుద్రూరు, ఆగస్టు 1: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఖాళీగా ఉన్న సహాయక వంట మనిషి (అసిస్టెంట్ కుక్) పోస్టుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పాఠశాల ప్రత్యేకాధికారి శ్యామల తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 18-40 ఏళ్ల వయస్సు గల మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఈనెల 2నుంచి 4వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలని ఆమె కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

● బోధన్ ఏసీపీ శ్రీనివాస్

బోధన్‌రూరల్, ఆగస్టు 1: వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. ఆగస్టు 15 నుంచి ద్విచక్ర వాహనదారులందరు హెల్మెట్ ధరించాలని అన్నారు. గురువారం బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తా, అంబేద్కర్ చౌరస్తా తదితర ప్రధాన కూడళ్లలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇవ్వవద్దన్నారు. ద్విచక్ర వాహనదారులు రాంగ్‌రూట్‌లో వాహనాలను నడపకూడదని సూచించారు. కార్యక్రమంలో బోధన్ ఎంవీఐ శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, పట్టణ సీఐ వీరయ్య పాల్గొన్నారు.


జనహృదయ నేతకు
జన్మదిన శుభాకాంక్షలు
బోధన్ నియోజకవర్గ రైతు బాంధవుడు,
పేదల పెన్నిధి సౌమ్యులు, బడుగు, నిగర్వి,
బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి,
సేవా తత్పరుడు, ప్రజాబంధు,
అలుపెరుగని పోరాట యోధుడు,
నిరంతర శ్రామికుడు, అపార భగీరథుడు,
జన హృదయ నేత, బోధన్ శాసన సభ్యులు
కాబోయే తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు
గౌ॥ శ్రీ పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి గారికి
మాయొక్క హృదయపూర్వక జన్మదిన
శుభాకాంక్షలు
అభినందనలతో...
INDIAN TERRAIN
"makes you feel good"
AB.శ్రీనివాస్ (చిన్నా)
TPCC అధికార ప్రతినిధి,
ఆర్మూర్ నియోజకవర్గం

ఇది జాతీయ విపత్తే

మా నాన్నను కోల్పోయినప్పటి పరిస్థితి గుర్తుకొచ్చింది: రాహుల్‌గాంధీ

- సోదరి ప్రియాంకతో కలిసి.. ముండక్కై, చురాల్‌మలలో పర్యటన
- జాతీయ విపత్తుగా ప్రకటించాలి: పినరయి
- 289కి పెరిగిన మరణాలు



పునరావాస శిబిరంలో బాధితులను ఓదారుస్తున్న రాహుల్, ప్రియాంక

వయనాడ్, ఆగస్టు 1: "వయనాడ్‌లో తీవ్ర విషాదం నెలకొంది. ఆ దృశ్యాలు హృదయాన్ని తీవ్రంగా గాయపరుస్తున్నాయి. నాకు ఏం చెప్పాలో తెలియడం లేదు. మా నాన్న చనిపోయినప్పుడు ఎలా ఉండేదో.. ఇప్పుడు అలాంటి బాధనే ఎదుర్కొంటున్నాను. నా దృష్టిలో ఇది జాతీయ విపత్తే" అని లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఉద్వేగంతో అన్నారు. గురువారం ఆయన తన సోదరి ప్రియాంక గాంధీతో కలిసి వయనాడ్‌లో కొండచరియల బాధిత ప్రాంతాలు-- ముండక్కై, చురాల్‌మల, అట్టమల, మెప్పాడిలో పర్యటించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో, ఆస్పత్రుల్లో బాధితులతో మాట్లాడారు. "దేశం మీ వెన్నంటే ఉంది.." అంటూ వారికి ధైర్యం చెప్పారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇది బాధాకరమైన పరిస్థితి అని.. పినరయి ప్రభుత్వం బాధితులకు అన్ని విధాలా సాయం చేయడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ముందే హెచ్చరించామంటూ లోక్‌సభలో హోంమంత్రి అమిత్‌షా చేసిన ప్రకటన గురించి విలేకరులు ప్రస్తావించగా.. "ఇది రాజకీయ ఘర్షణకు సమయం కాదు. అన్ని వ్యవస్థలు కలిసికట్టుగా పనిచేయాల్సిన తరుణమిది" అని వ్యాఖ్యానించారు. కరోనా కష్టకాలంలో తాను, ప్రియాంక వయనాడ్ ప్రజలకు అండగా ఉన్న విషయాన్ని గుర్తుచేస్తూ.. ఇప్పుడు కూడా సహాయక చర్యలు, పునరావాస కార్యక్రమాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. అనంతరం ఇదే విషయాన్ని తన ఎక్స్, ఫేస్‌బుక్ ఖాతాల్లో పోస్ట్ చేశారు. మరోవైపు కేరళ సీఎం పినరయి విజయన్ కూడా వయనాడ్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 280కి పైగా పౌరులు చనిపోయారని, కేంద్రం జాతీయ విపత్తుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. జాతీయ విపత్తుగా ప్రకటించడానికి అభ్యంతరం ఏంటని ప్రశ్నించారు. సహాయక చర్యల్లో పాల్గొంటున్న సైన్యం, రెస్క్యూ వర్కర్లు, స్థానికులను ఆయన అభినందించారు. ఆర్మీ జాగిలాలు మృతదేహాలను గుర్తిస్తున్నాయని, నదిలో కొట్టుకుపోయిన శరీర భాగాలను వెలికితీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. కాగా.. కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో మృతుల సంఖ్య 289కి పెరిగినట్లు అధికారులు వివరించారు. గల్లంతైన వారి ఆచూకీ తెలుసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

డార్క్ టూరిజం వద్దు

వయనాడ్‌లో డార్క్ టూరిజానికి రావొద్దంటూ కేరళ పోలీసులు సామాజిక మాధ్యమాల్లో విజ్ఞప్తి చేశారు. దీంతో.. 'డార్క్ టూరిజం' అనే పదం వైరల్‌గా మారింది. 'చెర్నోబిల్ అండ్ ది డార్క్ టూరిస్ట్' టీవీ షోతో ఈ పదం బాగా పాపులర్ అయింది. మరణం, విషాదం, హింస చోటుచేసుకుని, అసాధారణ పరిస్థితులు ఉండే ప్రదేశాలను సందర్శించడాన్ని డార్క్ టూరిజం అంటారు. ఉదాహరణకు ఉక్రెయిన్‌లోని చెర్నోబిల్ (అణు విద్యుత్తు కేంద్రం) ఘటన, కాంబోడియాలో కిల్లింగ్ ఫీల్డ్స్, పోలెండ్‌లోని అశ్విట్జ్ క్యాంప్ వంటివి డార్క్ టూరిజం కిందకు వస్తాయి. ఇప్పుడు వయనాడ్‌కు డార్క్ టూరిస్టులు వస్తే.. సహాయక చర్యలకు ఆటంకాలేర్పడతాయని కేరళ పోలీసులు ఆందోళన వ్యక్తం చేశారు.

హమాస్‌కు భారీ దెబ్బ!

- ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మిలిటరీ చీఫ్ డెయిఫ్ హతం!
- జూలై 13న గాజాలో అంతం చేశాం
- ప్రకటించిన ఇజ్రాయెల్ సైన్యం
- ఆ ప్రకటనను ఖండించిన హమాస్

జెరూసలెం, ఆగస్టు 1: హమాస్‌కు మరో భారీ దెబ్బ తగిలింది. ఇరాన్ రక్షణలో ఉన్న హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియా హత్యకు గురైన మరునాడే హమాస్ మిలిటరీ చీఫ్, ఇజ్రాయెల్‌పై దాడుల వ్యూహకర్త మహమ్మద్ డెయిఫ్ హతమయ్యాడు. డెయిఫ్‌ను తమ సైన్యం అంతం చేసినట్టు ఇజ్రాయెల్ గురువారం అధికారికంగా ప్రకటించింది. తన ప్రకటనలో ఆపరేషన్ వివరాలను వెల్లడించింది. "మా సైన్యం (ఐడీఎఫ్) గత నెల 13న గాజాలోని ఖాన్ యూనిస్ ప్రాంతంపై జెట్లతో దాడి చేసింది. అక్కడ హమాస్‌కు చెందిన డిప్యూటీ కమాండరు నివాసంలో డెయిఫ్ ఉన్నట్టు గుర్తించాం. అక్కడ జెట్లతో బాంబులు ప్రయోగించాం. ఈ దాడిలో డెయిఫ్ హతమయ్యాడు" అని ఆ ప్రకటనలో తెలిపింది. గత ఏడాది అక్టోబరు ఏడున ఇజ్రాయెల్ భూభాగంపై జరిగిన దాడుల ఆలోచన, ప్రణాళిక, అమలు అంతా డెయిఫ్ నేతృత్వంలో జరిగిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. ఈ దాడుల్లో 1197 మంది ఇజ్రాయెల్ పౌరులు చనిపోయారు. కాగా, డెయిఫ్ మరణవార్తపై హమాస్ స్పందించింది. ఖాన్ యూనిస్‌పై జూలైలో ఇజ్రాయెల్ దాడులు చేసిన మాట నిజమేనని, అందులో 90మంది చనిపోయారని, మృతుల్లో డెయిఫ్ లేరని గాజాలోని హమాస్‌కు చెందిన ఆరోగ్య వర్గాలు ధ్రువీకరించాయి.

ఆగస్టు, సెప్టెంబరులోనూ జోరు వానలు!

- భారత వాతావరణ శాఖ అంచనా

విశాఖపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాల సీజన్‌లో తొలి అర్ధభాగం మంచి వర్షాలు కురిశాయి. అదే జోరు ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కొనసాగనుంది. రెండు నెలల్లో దేశంలోని అనేక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షపాతం (దీర్ఘకాలిక సగటులో 106 శాతం) నమోదవుతుంది. అయితే ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు భారతంలో కొన్ని ప్రాంతాలు, సౌరాష్ట్ర, లద్దాక్, మధ్య, దక్షిణ భారతంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఆగస్టు నెలలో ఈశాన్య రాష్ట్రాలు, వాయవ్య, మధ్య, తూర్పు, దక్షిణాదిలో పలు భాగాలు, కశ్మీర్, లద్దాక్ వంటి ప్రాంతాలు తప్ప దేశంలో మిగిలిన ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుంది. ఈ మేరకు ఆగస్టు, సెప్టెంబరు నెలలకు సంబంధించి ముందస్తు అంచనా నివేదికను వాతావరణ శాఖ గురువారం విడుదల చేసింది. ఆగస్టులో దక్షిణాది రాష్ట్రాల్లో తప్ప దేశంలోని అనేక ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని తెలిపింది. కాగా, ఆగస్టులో దక్షిణ కోస్తా, సీమల్లో ఎక్కువ, ఉత్తర కోస్తాలో తక్కువ వర్షాలు ఆగస్టు నెలలో దక్షిణ కోస్తా, రాయలసీమల్లో సాధారణం, అంతకంటే ఎక్కువ వర్షాలు కురవనున్నాయి. ఉత్తర తెలంగాణ, ఉత్తర కోస్తాలతోపాటు, దక్షిణ ఛత్తీస్‌గఢ్‌లో సాధారణం కంటే తక్కువ వర్షాలు కురవనున్నాయని వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఉత్తరాది అతలాకుతలం

(మొదటి పేజీ తరువాయి)





వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలీలో ధ్వంసమైన రోడ్డు

కోల్పోయారు. కులు జిల్లాలో ఏడుగురు కొట్టుకుపోయారు. మలానా జల విద్యుత్ కేంద్రంలో పలువురు చిక్కుకుపోయారు. బియాస్ నది ఉధృతి, కొండచరియలు విరిగిపడడంతో కీలకమైన మనాలీ-చండీగఢ్ జాతీయ రహదారి పలుచోట్ల తీవ్రంగా దెబ్బతిన్నది. హిమాచల్ సీఎం సుఖుకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫోన్ చేసి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కాగా, రాష్ట్రంలోని పాలంపూర్, చౌరీలో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ధర్మశాల (18 సెం.మీ.) సహా పలు ప్రాంతాల్లో 10కి పైగా సెం.మీ. వర్షం పడింది. కంగ్రా, కులు, మండిలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో రాత్రికి రాత్రే వరద పోటెత్తింది. పలు నదులు ప్రమాదకర స్థాయిని దాటి ప్రవహిస్తున్నాయి. డెహ్రాడూన్‌లో పరిస్థితి తీవ్రంగా ఉంది. రాష్ట్రంలో మొత్తం 12 మంది మృతిచెందారు. హరిద్వార్‌లోనే ఆరుగురు చనిపోయారు. ఇక్కడ 21 సెం.మీ. వర్షపాతం నమోదైంది. చాలాచోట్ల 10 సెం.మీ. పైన వాన పడింది. కేదార్‌నాథ్ మార్గంలో 1,500 మంది యాత్రికులు చిక్కుకుపోయారు. వీరిలో 425 మందిని హెలికాప్టర్ ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఉత్తరాఖండ్, హిమాచల్‌లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సైన్యం, స్థానిక పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలోని చాలా ప్రాంతాలు ఇంకా నీటిలోనే ఉన్నాయి. ఆరుచోట్ల ఒక్క రోజులోనే 10 సెం.మీ.పైగా వర్షపాతం నమోదైంది. వివిధ ఘటనల్లో ఐదుగురు చనిపోయినట్లు అధికారులు తెలిపారు. 12 ఏళ్ల బాలుడు, 26 ఏళ్ల యువకుడు విద్యుదాఘాతంతో ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు రాజస్థాన్ రాజధాని జైపూర్‌ను వర్షాలు ముంచెత్తాయి. ఓ ఇంట్లోకి వరద చేరడంతో ఆరేళ్ల బాలిక సహా ముగ్గురు మృతిచెందారు. హిమాచల్, పంజాబ్, హరియాణా, ఢిల్లీ, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, గోవాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

పార్లమెంట్ పైకప్పు లీకేజీ

- బీజేపీ ప్రభుత్వంపై ప్రతిపక్షాల మండిపాటు
- లీకేజీ స్వల్పమే.. పరిష్కరించాం: కేంద్రం





న్యూఢిల్లీ, ఆగస్టు 1: ఢిల్లీలో కురుస్తున్న భారీ వర్షాలకు కొత్త పార్లమెంటు భవనం పైకప్పు లీకవుతోంది. రూ.1,000 కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన ఈ భవనం లాబీలోని గాజు పైకప్పు నుంచి కింద ఉంచిన బకెట్‌లోకి నీరు ధారగా పడుతున్న వీడియోను సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సామాజిక మాధ్యమాల్లో షేర్ చేశారు. "కొత్త భవనం కంటే పాత భవనం చాలా మెరుగ్గా ఉంది. వర్షాకాల సమావేశాలను పాతదానిలో ఎందుకు నిర్వహించకూడదు. కనీసం కొత్తదానిలో నీరు కారడం ఆగిపోయే వరకైనా..' అంటూ వ్యంగాస్త్రాలు సంధించారు. ఈ ప్రభుత్వ హయాంలో నిర్మించిన ప్రతి కొత్త భవనం పైకప్పు నుంచి నీరు లీకవడం.. బాగా ఆలోచించి రూపొందించిన డిజైన్‌లో భాగమా అని ప్రజలు అడుగుతున్నారని ఆయన బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. ఈ వీడియోపై కాంగ్రెస్ ఎంపీ మాణిక్కం ఠాగూర్ స్పందించారు. "బయట పేపర్ లీక్.. లోపల వాటర్ లీక్.. నిర్మించిన ఏడాది పూర్తి కాకుండానే పార్లమెంట్ లాబీలో నీరు లీక్ కావడం కొత్త భవనంలో అత్యవసర పునరుద్ధరణ సమస్యలను ఎత్తి చూపుతోంది" అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై చర్చించడానికి ప్రస్తుత లోక్‌సభ సమావేశాల్లో ఆయన వాయిదా తీర్మానం ప్రవేశపెట్టారు. 'రూ.1,200 కోట్ల వ్యయంతో నిర్మించిన పార్లమెంట్ ఇప్పుడు రూ.120 బకెట్‌పై ఆధారపడి ఉంది' అని ఆమ్ ఆద్మీ పార్టీ ఎద్దేవా చేసింది. సెంట్రల్ విస్టా ప్రాజెక్టులో భాగంగా కొత్త పార్లమెంట్ భవనాన్ని 2023 మే 28న ప్రధాని మోదీ ప్రారంభించారు. కాగా, పైకప్పు గ్లాస్ డోమ్‌లకు ఏర్పాటు చేసిన పట్టీలు వదులుగా ఉండటంతో కొత్త పార్లమెంటు భవనం మకర ద్వారం వద్ద స్వల్పంగా నీరు లీకైందని లోక్‌సభ సెక్రటేరియట్ తెలిపింది. సకాలంలో సమస్యను గుర్తించి, వెంటనే మరమ్మతులు చేపట్టామని, అంతటితో నీరు కారడం ఆగిపోయిందని కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది.